క్లుప్తంగా

'కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి'



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 18వ వర్ధంతిని స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన కాన్షిరామ్‌కు భారతరత్న అవార్డుతోపాటు ఆయన పేరిట స్టాంప్ విడుదలచేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు వెంకటేశం, రాజు, రాంబాబు, బాబు, విక్రమ్ తదితరులు ఉన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్ల పర్యవేక్షణ



సిద్దిపేటజోన్: ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు

అక్కన్నపేట(హుస్నాబాద్)/దుబ్బాక/సిద్దిపేట జోన్: ఓవైపు దసరా నవరాత్రి ఉత్సవాలు, మరోవైపు బతుకమ్మ సంబరాలతో గ్రామాల్లో సందడి నెలకొంది. బతుకమ్మ వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి. గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ భానోతు జయరాం అక్కన్నపేట మండలంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. దుబ్బాక పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. పోచమ్మ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుకునేందుకు డీజే ఏర్పాటు చేశామని చెప్పారు. సిద్దిపేట కోమటి చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు ఏర్పాట్లను పరిశీలించారు.

తాళ్లకుంట చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న శశిధర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ శివారులోని తాళ్లకుంట చెరువు అన్యాక్రాంతం అవుతుందని గ్రామస్తుల ఇచ్చిన వినతి మేరకు ఇరిగేషన్ అధికారులు బుధవారం చెరువును పరిశీలించారు. చెరువు ఆక్రమణకు గురవుతోందని గుర్తించారు. వెంటనే హద్దులు ఏర్పాటు చేయాలని రెవెన్యూశాఖకు నివేదిక పంపించారు. ఇరిగేషన్ ఏఈ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ చెరువునకు సంబంధించిన శిఖం భూమి, ఎఫ్‌టీఎల్ పరిధికి పది రోజుల్లో హద్దులు ఏర్పాటుచేసే బాధ్యత తానే తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్ గౌడ్, మల్లం బాలయ్య, పాశం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ దయతో అభివృద్ధి చేసుకుందాం

దుబ్బాకటౌన్: అమ్మ దయతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దుబ్బాకలో యువకిరణం స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో యువకిరణం స్పోర్ట్స్ యూత్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలి

బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి గుట్టకు సమీపంలో జరుగుతున్న చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన చర్చి నిర్మాణం చేపడుతున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలన్నారు. ఆయన వెంట కరుణాకర్, మధు, వంశీకృష్ణ, మహేశ్ తదితరులు ఉన్నారు.

'గునుగు'.. కనుమరుగు

- బతుకమ్మ పండుగకు పూల కరువు
- గడ్డి మందుల వాడకమే కారణం
- చిన్న కట్టకు రూ.50లు డిమాండ్
- వివిధ రకాల పువ్వులపైనే ఆధారం



గునుగు పువ్వు కోసం వెతుకుతున్న చిన్నారులు

దుబ్బాక: బతుకమ్మ పండుగ అనగానే గుర్తొచ్చేది గునుగు పువ్వు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మను పేర్చడంలో గునుగు పువ్వుది అగ్రస్థానం. అలాంటి గునుగు పువ్వు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు మక్కజొన్న, ఇతర మెట్ట పంటల్లో, బీడు భూముల్లో ఎక్కడ చూసినా గునుగు పువ్వులు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం రైతులు కలుపు నివారణకు గడ్డి మందులు స్ప్రే చేయడంతో గునుగు పువ్వు అంతరించి పోతోంది. అక్కడక్కడా మాత్రమే కనిపిస్తోంది. సద్దుల బతుకమ్మ పండుగకు గునుగు పువ్వు కోసం ప్రజలు చాలా ఆసక్తిగా వెతుకుతున్నారు. పొలాలు, చెల్కల వెంట తిరిగినా గునుగు పువ్వు దొరకడం లేదు. దీంతో బంతి, ఇతర పువ్వులు కొనుగోలు చేస్తున్నారు. గునుగు పువ్వుకు చాలా డిమాండ్ పెరిగింది. చిన్న కట్టకు రూ.50కు పైగా ధరపలుకుతోంది.




"గడ్డి మందుల ప్రభావంతోనే..

ఎక్కడ పడితే అక్కడ కనిపించే గునుగు పువ్వు ఇప్పుడు చూద్దామన్నా కనబడడం లేదు. పంట చేలలో కలుపు నివారణకు రైతులు గడ్డి మందులు చల్లుతుండడంతో గునుగు నశించి పోతోంది. గునుగు పువ్వు అంతరించి పోకుండా చూసుకునే బాధ్యత మనందరిపై ఉంది.

– గన్నె వనిత, మున్సిపల్ చైర్‌పర్సన్, దుబ్బాక"

సంతోషంగా సద్దుల బతుకమ్మ

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకైన సద్దుల బతుకమ్మ పండుగను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని అలాంటి సంస్కృతి మన తెలంగాణలోనే ఉందన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని చెప్పారు. తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ప్రతిరోజు వేడుకగా ఆడపడుచులు జరుపుకునే గొప్ప పండగ అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించిందని, అలాగే పండుగ సందర్భంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేసిందని గుర్తుచేశారు. ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను కుటుంబ సభ్యులతో సంబురంగా నిర్వహించుకోవాలని సూచిచారు.

త్రిరాత్రోత్సవాలు ప్రారంభం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో దేవీత్రిరాత్రోత్సవాలు ఆలయ అధికారులు, అర్చకులు వీరశైవ సంప్రదాయం ప్రకారం బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, స్థానచార్య పి.మల్లయ్య, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.



మల్లన్న సన్నిధిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఆలయ అధికారులు, అర్చకులు

సరస్వతీ నమస్తుభ్యం..

జిల్లా వ్యాప్తంగా దేవిశరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు బుధవారం సరస్వతీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద చిన్నారులకు అక్షరభ్యాసాలు చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సరస్వతిగా.. రేణుకాఎల్లమ్మ



కొండపాక(గజ్వేల్): సరస్వతి రూపంలో దుర్గామాత



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు



చిన్నకోడూరు(సిద్దిపేట): సికిండ్లాపూర్‌లో..



నంగునూరు(సిద్దిపేట): పాలమాకులలో..



తొగుట(దుబ్బాక): సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

గండికి మోక్షం

వర్గల్(గజ్వేల్): ఎట్టకేలకు పెద్దచెరువు గండికి మోక్షం లభించింది. గత నెల 27న 'రెండేళ్ల క్రితం గండి..' శీర్షికతో పెద్దచెరువు దుస్థితిని వెల్లడిస్తూ 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. బుధవారం మట్టి నింపి గండిని పూడ్చారు. చదునుచేసి చెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌ను సిద్ధం చేశారు. పంచాయతీ కార్యదర్శి సందీప్‌కుమార్ పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా తుక్కిఖాల్సా తదితర గ్రామాల్లో కూడా బతుకమ్మ ఘాట్‌లను సిద్ధం చేశారు.



సిద్ధమైన ఘాట్

క్రమశిక్షణతోనే లక్ష్య సాధన

తొగుట(దుబ్బాక): యువత క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి సూచించారు. డీఎస్సీలో ఎస్‌జీటీ టీచర్ ఉద్యోగం సాధించిన వెంకట్రావుపేటకు చెందిన పిట్ల గోపాల్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో ట్రాక్‌మేన్ ఉద్యోగం చేస్తూనే పట్టుదలతో టీచర్ ఉద్యోగం సంపాదించిన గోపాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాములు, స్వామిగౌడ్, రాజేశ్, పరశురాములు, జహంగీర్, కనకరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి శివారులో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ అభిలాష్ బుధవారం స్వాధీనం చేసుకున్నారు. తమకు వచ్చిన సమాచరం మేరకు తనిఖీ నిర్వహించగా గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారని, అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

హైడ్రాతో పేదల బతుకులు ఆగం

బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాతో పేదల బతుకులను ఆగం చేస్తున్నారని, మూసీ బాధితులకు ఇంటి నిర్మాణంతో పాటు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల హామీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, మహిళలకు ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలయ్యాయన్నారు. కేసీఆర్ కుటుంబంపై సీఎం కక్ష కట్టారని, అందుకే మంత్రి సురేఖ, మైనంపల్లి హన్మంతరావుతో ఆరోపణలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను దర్శించుకుని పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, యాదవరెడ్డి కవిత, కిరణ్‌గౌడ్, మల్లేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే చీడపీడల నివారణ

వ్యవసాయ అధికారి నరేశ్



వరి సాగును పరిశీలిస్తున్న నరేశ్

దుబ్బాకటౌన్: వరి పంటలో తెగుళ్ల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ సూచించారు. రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ గ్రామ పరిధిలోని వరి పొలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి, వరి పంటలలో వచ్చే చీడ పీడల నివారణ కోసం రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, కంపునల్లి, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దాని నివారణ కోసం రైతులు క్లోర్ ఫైరిఫాస్ 20శాతం ఈసీ 400 మీ.లీ + ప్రోపికొనజోల్ 25శాతం ఈసీ 200 మీ.లీ ఎకరానికి కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించవచ్చని సూచించారు. వరిలో తెల్ల కంకి, గింజమచ్చ తెగుళ్ల నివారించవచ్చన్నారు. ఆయన వెంట ఏఈఓ ప్రవీణ్, రైతులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సిద్దిపేటఅర్బన్: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ సూచించారు. ఆయన గాడిచర్లపల్లిలో పత్తి, వరి పంటలను పరిశీలించారు. విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగంపై అధికారుల సలహాలు పాటించాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం: సీపీ

సిద్దిపేటకమాన్: దసరా పండగ నేపథ్యంలో ఆఫర్ల పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ ఫెడెక్స్ కొరియర్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వన్‌టౌన్ సీఐగా వాసుదేవరావు



సిద్దిపేటకమాన్: సిద్దిపేట వన్‌టౌన్ పోలీసు స్టేషన్ నూతన సీఐగా యస్.వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు, నేతలు సహకరించాలని కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని పలు ప్రాంతాలలో రెండు రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో నలుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా బుధవారం వారికి రూ.7,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మద్దతు ధర కల్పించాలని డిమాండ్

గజ్వేల్‌రూరల్: వంటిమామిడి మార్కెట్‌కు హైదరాబాద్ నుంచి వచ్చే కూరగాయలను నియంత్రించి రైతులకు మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వంటిమామిడి కూరగాయల మార్కెట్‌కు సమీప ప్రాంతాల రైతులతోపాటు ఇతర జిల్లాల నుంచి కూడా కూరగాయలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారని వాపోయారు. హైదరాబాద్ నుంచి పెద్దమొత్తంలో కూరగాయలను దిగుమతి చేయడంతో ఈ ప్రాంత రైతులకు మద్దతు ధర లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో హమాలీ కార్మికులు, మార్కెట్లో పనిచేసే వారికి ఉపాధి లేకుండా పోతుందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోండి



సమావేశంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ప్రతినిధులు

విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సిద్దిపేటజోన్: విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు చాలా పేదరికంతో కొట్టుమిట్టాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలన్నారు. కుటీర పరిశ్రమలకు ఉచితంగా విద్యుత్, 50యేళ్లు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్, జిల్లా కేంద్రంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసుల వేధింపులు ఆపాలని, సంఘం సభ్యులకు డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని, అటవీశాఖ అధికారుల దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శ్రీనివాస్, గోపాల్ చారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గజ్వేల్‌రూరల్: విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి బయలుదేరిన వారిని బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఐవోసీలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, రాములు, గణేశ్, భిక్షపతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ హమాలీ కుటుంబానికి ఆర్థిక సాయం

దుబ్బాకటౌన్: అనారోగ్యంతో మృతి చెందిన హమాలీ కార్మికుడి కుటుంబానికి తోటి హమాలీ కార్మికులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. రాయపోల్ మండలం వడ్డేపల్లిలో హమాలీగా పనిచేస్తున్న కొల్లూరు రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వడ్డేపల్లి హమాలీ సంఘం కార్మికులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో శ్యామనాథ్, నర్సయ్య, మురళి, కుమార్, సత్తయ్య, సుధాకర్, యాదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ దోహదపడుతుందన్నారు.

◆ గుంతల పూడ్చివేత

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రం నుంచి ముస్త్యాల గ్రామ మధ్యలోని రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతలను పూడ్చివేశారు. చొరవ చూపిన కార్యదర్శి వెంకటేశ్వర్లును గ్రామస్తులు అభినందించారు.

◆ హామీల అమలుకు పోరాడుదాం

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అయినాపూర్‌లో కర్రోల ఎల్లయ్య అధ్యక్షతన గ్రామశాఖ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శశిధర్, సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, ఇస్తారి, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నవంబర్ 8నుంచి సీఎం టోర్నీ

సిద్దిపేటఅర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నవంబర్ 8వ తేదీ నుంచి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ నేత, హైకోర్ట్ న్యాయవాది గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం అర్బన్ ప్రెస్ క్లబ్ వద్ద ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీలో విజేతకు రూ.2లక్షలు, రన్నరప్‌కు రూ.లక్ష, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.50వేలు, అత్యధిక వికెట్లు తీసిన వారికి రూ.25వేలు అందించనున్నట్లు తెలిపారు.

◆ ఇబ్బందులు కలుగకుండా చర్యలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పాండవుల చెరువు, ఊర చెరువు, బడి చెరువు, క్యాసారం చెరువు, సంగుపల్లి చెరువు కట్టల వద్ద విద్యుత్ స్తంభాలు వీధి దీపాల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత తదితర పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బతుకమ్మల నిమజ్జన ప్రాంతాల్లో మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులున్నారు.

◆ ఏకరూప దుస్తుల పంపిణీ



కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని మర్పడ్గ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భైరయ్య, ట్రస్టు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.